భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 27.0
తేమ : 36.0 - 26.0



టీడీఆర్ బాండ్ల కొనుగోల్‌మాల్



విమానాశ్రయ భూముల్లో 60 అడుగుల రహదారి ఇదే..

తాడేపల్లిగూడెంలో వైసీపీ నేత దందా

- రూ. 150 కోట్ల విలువైన బాండ్‌లు జారీ
- మార్కెట్‌లో రూ.60 కోట్లకు విక్రయం
- వైసీపీ నేతకు సింహభాగం
- స్థల యజమానులతో అనేక ఒప్పందాలు
- వైసీపీ ప్రభుత్వం వస్తే బాండ్‌లు ఇచ్చేలా ప్రణాళిక
- ప్రభుత్వం మారిపోవడంతో మారిన తలరాత
- వెలికి తీస్తున్న కూటమి నేతలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో మీ స్థలం వెంబడి మాస్టర్ ప్లాన్ రహదారి వెళ్లింది. అదే స్థలంలో నిర్మాణాలు చేపట్టాలను కుంటున్నారా ? సొమ్ములు చేతిలో లేవా.. అయితే మున్సిపల్ అధికారులను సంప్రదించండి. మాస్టర్ ప్లాన్ రహదారిలో ఉన్న స్థలానికి టీడీఆర్ బాండ్‌లు ఇచ్చేస్తారు. వాటిని బయట మార్కెట్‌లో అమ్ముకుంటే కోట్ల రూపాయలు వస్తాయి. మాస్టర్ ప్లాన్ రహదారికి ఆనుకుని ఉన్న మిగిలిన స్థలంలో అదే సొమ్ముతో అపార్ట్‌మెంట్ నిర్మించుకోవచ్చు. ఇలాగని ఆశపడి వెళితే కుదరదు. నేతలు ముందుకొస్తారు. బాండ్‌లు జారీ చేయిస్తారు. అమ్ముకుంటారు. వారే సొమ్ములు తీసుకుంటారు. లబ్ధిపొందుతారు. మార్కెట్ విలువ ప్రకారం మీ సొమ్ములు మీకు ఇస్తారు. మిగిలిన సొమ్మంతా నేతల జేబులోకి వెళ్లిపోతుంది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇదే జరిగింది. మాస్టర్ ప్లాన్ రహదారి పేరుతో బాండ్‌లు జారీచేశారు. రహదారిని విస్తరించ లేదు. అదే చోట అనేకమంది స్థల యజమానులు ఇప్పటికీ వ్యాపారాలు చేసుకుంటున్నారు. అంటే బాండ్‌లు జారీచేసిన స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలి. రహదారిని విస్తరించాలి. ఇవేమీ చేయడం లేదు. బాండ్‌లు మాత్రం జారీచేసింది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 150 కోట్లు విలువైన బాండ్‌లు జారీచేశారు. ఇందులో వైసీపీ నేత కీలకంగా వ్యవహరించారు. కోట్ల రూపాయలు కొల్ల గొట్టారు. మున్సిపాలిటీ జారీచేసిన బాండ్‌లను మార్కెట్‌లో 40 శాతం ధరకు విక్రయించుకున్నారు. అంటే రూ. 60 కోట్ల మేర లబ్ధి చేకూరింది. భీమవరం-తాడేపల్లిగూడెం ప్రధాన రహదారి, పట్టణంలో 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారుల్లో బాండ్‌లు జారీ అయిపోయాయి. అప్పటి మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ బాండ్‌లు జారీ చేయించారు. మున్సిపల్ శాఖలో ఉన్నతాధికారి చక్రం తిప్పారు. వారి ఒత్తిడితో క్షేత్ర స్థాయిలో బాండ్‌లు జారీ అయిపోయాయి. స్థల యజమానులు ఒకరైతే... బాండ్‌లు జారీ అయింది నిర్మాణదారులకు. ఇలా ఎన్నో బాండ్‌లు జారీ అయిపోయాయి. మరోవైపు వైసీపీ నేతకు అండగా ఉండే వ్యాపారులు కూడా లబ్ధిపొందారు. తమ దుకాణాలు మాస్టర్ ప్లాన్‌లో రహదారిలో ఉన్నాయి. ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి రాసిచ్చేశారు. బాండ్‌లు పొందారు. అమ్ముకున్నారు. ఇప్పటికీ మున్సిపాలిటీకి ఇచ్చిన స్థలంలో వ్యాపారాలు చేసుకుంటు న్నారు. తాడేపల్లిగూడెం- భీమవరం రహదారిలో ప్రధాన



మిఠాయి కొట్టు యజమాని ఈ విధంగా భారీ మొత్తంలో లబ్ధి పొందారు. అధికార పార్టీ నేతకు ముడుపులు ముట్ట చెప్పారు.

స్థలాలు స్వాధీనం చేసుకోని మున్సిపాలిటీ

టీడీఆర్ బాండ్‌లు జారీచేసిన స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలి. తాడేపల్లిగూడెంలో మాత్రం అలా జరగలేదు. రహదారి విస్తరించినప్పుడు తీసుకుంటామని గతంలో అధికారులు చెప్పుకొచ్చారు.వాస్తవానికి తాడేపల్లి గూడెం-భీమవరం రహదారి విస్తరించే అవకాశం లేదని తెలిసి బాండ్‌లు జారీ చేశారు. స్థల యజమానులకు లబ్ధి చేకూర్చారు. టీడీఆర్ బాండ్‌ల జారీలో రూ. 60 కోట్లు మేర చేతులు మారితే వైసీపీ నేతకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరింది. బాండ్‌లు జారీ చేయించినందుకు బాండ్‌లు జారీ అయిన వ్యక్తుల నుంచి కోట్లాది రూపాయలు తీసుకున్నారు.

సొంత స్థలాన్ని రాసిచ్చిన నేత

విమానాశ్రయ భూములకు ఆనుకుని వైసీపీ నేత 10 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి మీదుగా 60 అడుగుల రహదారి వెళ్లేలా మాస్టర్ ప్లాన్ రహదారి సిద్ధం చేశారు. మాస్టర్ ప్లాన్ రహదారిలో పడిన 60 సెంట్ల భూమిని గజాల రూపంలో మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేశారు. అదికూడా భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. అక్కడ ఎకరాల్లో కొనుగోలు చేసి గజాల్లో మున్సిపాలిటీకి రాసిచ్చిన ఘనుడు వైసీపీ నేత. అదేదో మున్సిపాలిటీకి అప్పనంగా ఇచ్చింది కాదు. బాండ్‌లు జారీ అయితే రూ. 15 కోట్లు లబ్ధి చేకూరేది. దానిని ఎన్నికల ముందు కూటమి నేతలు అడ్డుకున్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ వైసీపీ నేతకు పూర్తి స్థాయిలో సహకరించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జ్ అధికారి సంతకం చేయకపోవడంతో బాండ్‌ల జారీ ఆగిపోయింది. రాష్ట్ర స్థాయి అధికారులతో మున్సిపల్ ఇన్‌ఛార్జ్‌పై వైసీపీ నేత ఒత్తిడి తేచ్చే ప్రయత్నం చేశారు. అయినా ఇన్‌ఛార్జ్ అధికారి తలొగ్గలేదు. లేదంటే మున్సిపాలిటీ ఇచ్చే బాండ్‌ల రూపంలో రూ. 15 కోట్లు లబ్ధి పొందేవారు. ఇంతకి వైసీపీ నేత కొనుగోలు చేసిన 10 ఎకరాల భూమి విలువ రూ.12 కోట్లు లోపలే ఉంది. ఆ మొత్తాన్ని కేవలం మున్సిపాలిటీ ఇచ్చే 60 సెంట్లతో లాగేద్దామని వైసీపీ నేత ఆశించారు. టీడీఆర్ బాండ్‌ల జారీ కోసం తీవ్ర ప్రయత్నాలే చేశారు. కూటమి నేతలు అడ్డుపడడంతో పాచిక పారలేదు.

స్థల యజమానులతో ఒప్పందాలు

మరోసారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వైసీపీ నేత గట్టిగా నమ్మారు. మాస్టర్ ప్లాన్ రహదారి విస్తరించిన ఉన్న చోట స్థలాలను గుర్తించారు. స్థల యజమానులతో ఒప్పందాలు చేసుకున్నారు. అడ్వాన్స్ రూపంలో సొమ్ములు చెల్లించారు. వైసీపీ అధికారంలో వస్తే ఆ స్థలాలకు బాండ్‌లు ఇప్పించుకునేవారు. మార్కెట్ విలువ ఆధారంగా వారికి సొమ్ములు ఇచ్చేవారు. మరో మూడు రెట్లు సొమ్మును వైసీపీ నేత కాజేసేవారు. ప్రభుత్వం మారిపోవడంతో ప్రణాళిక అడ్డం తిరిగింది. గతంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్‌ల వ్యవహారం తెరపైకి వస్తోంది.

టీడీఆర్ బాండ్‌లు ఎప్పుడు ఇవ్వాలి

రహదారులు విస్తరించాల్సి వస్తే స్థల యజమానుల నుంచి మున్సిపాలిటీ భూ సేకరణ చేస్తుంది. గజాల్లో తీసుకుంటుంది. అందుకు నాలుగు రెట్లు సరిపడా బాండ్‌లు జారీచేస్తుంది. రహదారి విస్తరిస్తుంది. దీనివల్ల స్థలం కోల్పోయిన యజమానికి ఇబ్బంది ఉండదు. మున్సిపాలిటీ సొమ్ములు ఇవ్వాల్సిన అవసరం లేదు. కేవలం బాండ్‌లు ఇస్తుంది. వాటిని స్థల యజమానులు అమ్ముకుంటారు. లేదంటే తామే వినియోగించుకుంటారు. స్థలం ఇచ్చిన నాలుగు రెట్లు విస్తీర్ణంలో మున్సిపాలిటీ ప్లాన్ లేకుండానే అదనంగా నిర్మాణాలు చేసుకోవచ్చు. దానివల్ల స్థల యజమానులు లబ్ధిపొందుతారు. టీడీఆర్ బాండ్‌లు కొనుగోలు చేసుకున్నా సరే వారుకూడా అనుమతులు లేకుండా అదనంగా నిర్మించుకోవచ్చు. అందుకు విశాఖ, విజయవాడల్లో బిల్డర్‌లు టీడీఆర్ బాండ్‌లను కొనుగోలు చేస్తుంటారు. బాండ్ విలువ మొత్తంలో 40 శాతం ధర ఇస్తారు.దీనిని తాడేపల్లిగూడెం వైసీపీ నేత సద్వినియోగం చేసుకున్నారు. కోట్ల రూపాయలు ఆర్జించారు.



హౌసింగ్ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నాగరాణి

టిడ్కో ఇళ్లు పూర్తి చేయండి

కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 5 : పీఎంఎవై, టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగ రాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణం, టిడ్కో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్ కింద 70,119 గృహాలు మంజూరవగా 45,843 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని ఇప్పటివరకు 29,256 గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిం చామన్నారు. రాష్ట్రంలో జిల్లా 65 శాతం ప్రగతితో మూడో స్థానంలో నిలిచిందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ కింద 3,673 ఇళ్లు మంజూరవగా 3,290 నిర్మాణంలో ఉండగా 1,803 ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశామన్నారు. రాష్ట్రంలో జిల్లా 55 శాతం ప్రగతిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. టిడ్కో ఇళ్లపై అధికారులను ప్రశ్నించగా రెండు దశల్లో జిల్లాకు మొత్తం 21,424 ఇళ్లు మంజూ రయ్యాయని అధికారులు తెలిపారు. మొదటి విడతలో భీమవరంలో 8,352 తాడేపల్లిగూడెంలో 3,232, పాలకొల్లు 2,560 మొత్తం 11,136 ఇళ్లు మంజూరవగా ఇప్పటివరకు భీమవరంలో 5,408 తాడేపల్లిగూడెంలో 3.232., పాల కొల్లులో 2,560 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్టు తెలిపారు. భీమవరంలో 5,408 తాడేపల్లిగూడెంలో 2,144, పాల కొల్లులో 3.584 మొత్తం 11.136 ఇళ్లకు 90 శాతం పైగా పూర్తయినట్లు తెలిపారు. రెండవ విడతలో తణుకు పట్ట ణంలో 912 ఇళ్లు మంజూరు కాగా నిర్మాణాలు జరుగు తున్నాయన్నారు. గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు సాధ్యమైనంత త్వరగా అందజేయా లని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి జి.పిచ్చయ్య, ఈఈ బి.వెంకట రమణ, టిడ్కో ఈ.ఈ ఎం.ఎస్ స్వామినాయుడు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



శుభ్రంగా ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయ భవనాలు

టిడ్కో సముదాయంలో వెలుగులు

పాలకొల్లు టౌన్, జూలై, 5 :పాలకొల్లులో టిడ్కో గృహాల సముదాయ ప్రాంతమంతా కొత్తదనం సంతరించుకుంది. గత ప్రభుత్వ సమయంలో దట్టంగా చెత్తమొక్కలు మొలిచిపోయి, మురుగు గుంటలు, దుర్వాసన, రాత్రి సమ యంలో విద్యుత్ లైట్లు వెలగక టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటూ బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారు. టిడ్కో ఇళ్లపై మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టి పెట్టడంతో కాలనీ కొత్త రూపు సంతరించుకుంది. కాలనీ అభివృద్ధిపై రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు,పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, ఇతర ముఖ్య నాయకులుపై బాధ్యత పెట్టడంతో వీరు రెండు రోజులుగా కాలనీలో పర్యటిస్తూ సమస్యలపై దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనర్ విజ యసారధి, సిబ్బందితో కలిసి కాలనీలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరి స్తున్నారు. కాలనీలో చెత్త మొక్కలను తొలగించారు. మురుగు గుంటలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేశారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వీధిలైట్లు వేశారు. మంచినీటి ట్యాంకర్లతో తాగునీరు అందిస్తున్నారు. ఇలా ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గొల్లలకోడేరులో నారుమడికి గట్టు వేస్తున్న రైతు

జోరు వాన

భీమవరం టౌన్, జూలై 5: జిల్లాలో శుక్రవారం తెల్లవా రుజామున పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై ఏకధాటిగా వర్షం పడ టంతో పలు చోట్ల ఎక్కువగానే వర్షపాతం నమోదైంది. న రసాపురంలో 64.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తణుకులో 9.4 మి.మీ వర్షపాతం నమో దైంది. పెనుమంత్రలో 11.2, పెనుగొండలో 14.8, ఆచంటలో 15.4, పోడూరులో 19.4,మొగల్తూరులో 35.2, పాలకొల్లులో 50.4, యలమంచిలిలో 24.2, గణపవరంలో 16.8 ఆకివీడులో 10.2, ఉండిలో 33.4, పాలకోడేరులో 50.8, వీరవాసరంలో 50.6, భీమవరంలో 40.4, కాళ్లలో 23.2, తాడేపల్లిగూడెంలో 38.2, పెంటపాడులో 26.2, అత్తిలిలో 16.4, ఇరగవరంలో 19 మి.మీ వర్షపాతం నమో దైంది. జిల్లాలో మొత్తం వర్షపాతం 569.4 మి.మీ నమోద వగా సరాసరి వర్షపాతం 28.5 మి.మీ నమోదైంది.

నీటిలో నారుమళ్లు

పాలకోడేరు, జూలై 5: పంట కాల్వలు నిండుగా ప్రవ హించడంతో పాటు మరోవైపు వర్షాలు కురవడంతో నారు మడుల మునిగాయి. సార్వా సీజన్ మొదలైన నాటి నుంచి వర్షాలు కురుస్తూనే ఉండటంతో వేసుకున్న నారు మడులు వర్షం నీటికి మునుగుతూ తేలుతున్నాయి. నారుమడుల్లో ఉన్న నీటిని బయటకు తోడుకుంటున్నారు. పొలాల్లో నీరు బయటకు వెళ్లాలంటే ఇరిగేషన్ అధికా రులు స్పందించి కాల్వల్లో ప్రవాహాన్ని తగ్గించాల్సి ఉంది. గొల్లలకోడేరు గ్రామంలోని అనాకోడేరు పంట కాల్వను చేర్చి వందలాది ఎకరాల్లో రైతులు నారుమడులు వేసుకున్నారు. రైతులు నారుమడుల చుట్టూ గట్లు వేసుకుంటూ నారుమడులను రక్షించుకుంటున్నారు. లష్కర్లకు పరిస్థితిని వివరించినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరుపెక్కిన గోదావరి



7





వైభవంగా మావుళ్లమ్మ జాతర

పెనుగొండ, జూలై 5 :పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్ళమ్మ జాతర మావుళ్ళమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులచే ఘనంగా నిర్వహించారు.గరగల నృత్యాలు, సన్నాయి మేళాలు, బేతాళ నృత్య ప్రదర్శనలు, విచిత్ర వేషాలతో అమ్మవారి జాతర సాగింది. గ్రామానికి చెందిన ఆడపడుచులు జాతర కోసం రావడంతో ఊరంతా బంధువులతో కళకళలాడింది.మూడు రోజులు తీర్థం అనంతరం మంగళవారం భారీ అన్న సమారాధన చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



రేపటి నుంచి లక్ష్మీపురం జగన్నాథ రథోత్సవాలు

ద్వారకా తిరుమల, జూలై 5: శతాబ్ద కాలం నాటి పురాతన చరిత్ర కలిగిన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి జగన్నాథుని రథోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఈ ఉత్సవాలను పూరీ క్షేత్రంలో వలె ఇక్కడ శ్రీవారి దేవస్థానం వైభవంగా నిర్వహి స్తోంది. ఈ క్రమంలో పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు ఉత్సవ క్రతువులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని పరిసరాలను విద్యుత్ దీపాలతో సుందరీకరించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా ఈనెల 7న రథవాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి సాయంత్రం 5 గంటలకు శ్రీవారి క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. ఉత్సవాల ముగింపు రోజైన 16న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి సాయంత్రం 5 గంటలకు రథయాత్రగా వెళ్లనున్నారు.

దశావతారాలు ఇలా..


రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయావరణలోని కల్యాణ మండపంలో జగన్నాథస్వామి రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమీయనున్నారు. 7న మత్స్యావతారం 8న కూర్మ, 9న వరాహ, 10న నృశింహ, 11న వామన, 12న పరశురామ, 13న రామ, 14న కృష్ణా, 15న కల్కి, 16న వెంకటేశ్వరస్వామి అవతారంలో దర్శనమిస్తారు.

పెన్షన్ సొమ్ము రూ.2.5 లక్షలతో పరారైన సచివాలయ కార్యదర్శికి రిమాండ్



పాలకొల్లు రూరల్, జూలై 5 : పాలకొల్లు మండలం లంకల కోడేరు గ్రామ సచివాలయ కార్యదర్శి డి.రాముకు కోర్టు రిమాండ్ విధించింది. ఈనెల 1వ తేదీన సత్యనారాయణపురం గ్రామంలో వృద్ధులకు అందజేయవలసిన పెన్షన్ సొమ్ము 2 లక్షల 50 వేల 500 రూపాయలతో రాము పరారయ్యాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకొల్లు రూరల్ సిఐ కుడిపూడి సతీష్ ఉత్తర్వులతో ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేశారు. లంకలకోడేరు పంచాయతీ గ్రేడ్-5 సెక్రటరీగా పని చేస్తున్న రాముకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫోన్‌కాల్స్ ఆధారంగా రామును గురువారం రాత్రి పట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం రాము పాలకొల్లు పట్టణంలోని రమణ కాలనీలో ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నాడని తెలిపారు. క్యాసినో గేమ్‌లో సొమ్ము పోగొట్టుకోవడంతో పెన్షన్ సొమ్ము పంచడానికి సొమ్ము లేకపోవడంతో భయంతో పారిపోయినట్టు తెలిపారు. ఈనెల 4వ తేదీన లంకలకోడేరు వీఆర్వో, గ్రామ కార్యదర్శుల వద్దకు వచ్చి విషయం చెప్పగా వారు ఎంపీడీవో వద్ద హాజరు పరిచారని, ఎంపీడీవో రిపోర్టుతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చిన అప్పగించడంతో 420, 209 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

ఏపీ హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా సోమరాజు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 5: తాడే పల్లిగూడేనికి చెందిన యెలిశెట్టి సోమరాజు ఏపీ హైకోర్టు న్యాయ వాదిగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. సోమ రాజు 2005లో భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో లా డిగ్రీ పొందారు. అనంతరం తాడే పల్లిగూడెం బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2010లో హైద్రాబాద్ హైకోర్టులో న్యాయ వాదిగా కొనసాగారు. 2014లో ఏపీ ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులయ్యారు.



20-20 విజయోత్సవ ర్యాలీ

భీమవరం టౌన్, జూలై 5 : టి-20 క్రికెట్ ప్రపంచ ఛాంపి యన్‌గా భారత్ విజయం సాధించడంపై శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వ ర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో భీమవరంలో జాతీయ జెండా పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అను రాధ మాట్లాడుతూ 17 ఏళ్ల తరువాత టి-20 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో భారత్ విజయం సాధించడం ఆనందించదగ్గ విషయ మని, 2007 ధోని సారథ్యంలో 2024 రోహిత్ సారథ్యంలో విజయం సాధించారన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, చెరు కువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, నరహరిశెట్టి కృష్ణ, ఉండపల్లి రమేష్ నాయుడు, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.



కామినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్న నత్తగుల్లపాడు గ్రామస్థులు

ఏకతాటిపైకి నత్తగుల్లపాడు గ్రామస్థులు

కామినేని చొరవతో మూడున్నరేళ్ల వివాదానికి తెర

కైకలూరు, జూలై 5: కొల్లేరు సరస్సులో అది ఓ చిన్న గ్రామం..వివాదాలకతీతంగా అభివృద్ధితో పాటు అన్నీ సమస్యలు పరిష్కారం జరిగేవి. అలాంటి గ్రామం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు వర్గాలుగా చీల్చిపోయి మూడు న్నరేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. నూతనంగా గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ రెండు వర్గాల మధ్య సఖ్యత ఏర్పరచి గ్రామాభివృద్ధికి ఐక్యతగా పని చేయం డంటూ వెన్నుతట్టారు. కైకలూరు మండలం నత్తగుల్లపాడు పంచాయతీ గతంలో చటాకాయ్ పంచాయతీ పరిధిలో ఉండేది.మూడేళ్ల క్రితం ప్రత్యేక పంచాయతీగా నత్త గుల్లపాడును గుర్తించారు. అప్పటికే గ్రామస్థుల మధ్య స్వల్ప వివాదాలు ఉండేవి. ఇదే అదునుగా వైసీపీ పాలకులు పంచాయతీ ఏకగ్రీవం కానివ్వకుండా ఎన్నికలకు తెరతీశారు. పంచాయతీ ఏర్పడిన మొదటి దఫా ఎన్నికల్లోనే ఇరువర్గాల మధ్యన ఆసక్తికర పోరు జరిగింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అనుకూల అభ్యర్థి ముంగర రామకృష్ణంరాజు సర్పంచ్‌గా గెలుపొందారు. కొల్లేరు గ్రామం కావడంతో ఈ వివాదాలు చిలికిచిలికి పెద్దవి కావడంతో గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటు పడింది. గ్రామ కట్టుబాట్ల మధ్య చెరువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామపెద్దల ద్వారా గ్రామాభివృద్ధికి, ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేసేవారు. గతంలో ఏటా గ్రామానికి సుమారు రూ.20 లక్షల ఆదాయం చెరువుల నుంచి వచ్చేది. అయితే గత మూడున్నరేళ్లుగా చెరువుల పాటలు జరగకుండా గ్రామస్థులు అడ్డుకోవడంతో మూడేళ్లలో రూ.60 లక్షలు నష్టం వాటిల్లింది. దీంతో ఆలయాల్లో దీపాలు వెలిగించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఎన్నికలకు ముందు కొందరు గ్రామస్థులు డాక్టర్ కామినేని దృష్టికి తీసుకువెళ్లారు. తను గెలిచిన వెంటనే వారి సమస్యకు పరిష్కారం చూపుతానంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కామినేని సూచనలతో రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు ఇరువర్గాలను సముదాయించి ఒకే తాటి పైకి వచ్చారు. గ్రామస్థులంతా కామినేని ఇంటివద్ద ఆయన్ను కలిసి సంఘటితంగా ఉంటామని గ్రామాభివృద్ధికి కృషి చేయాలంటూ కోరారు. గ్రామాల్లో గొడవలకు ఎవరూ ప్రోత్సహించవద్దని ఎల్లప్పుడు తాను అండగా ఉంటానని కామినేని వారికి అభయమిచ్చారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

పరిశీలించిన తర్వాతే అనుమతులు : ఎమ్మెల్యే

భీమవరం టౌన్, జూలై 5 : పట్టణంలో ఇక నుంచి ఏ అభివృద్ధి పనులను అధికారులు ప్రతిపాదించినా వాటిని తాను స్వయంగా పరిశీలించిన అనంతరమే ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పులపర్తిరామాంజనేయులు (అంజి బాబు) ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శుక్రవా రం పట్టణంలో 2 కోట్ల 50 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను ఆయన స్వయంగా అధికారులతో కలసి పరిశీ లించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప నులపై ఫిర్యాదులు వస్తే మాత్రం ఉపేక్షించమన్నారు. అన్న క్యాంటీన్‌ల పరిస్థితిని పరిశీలించారు. క్యాంటీన్లు సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. జనసేన జిల్లా కార్యదర్శి చెలమల చంద్రశేఖర్, కోళ్ళ నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామ కృష్ణ, మద్దుల రాము, కమిషనర్ ఎం.శ్యామల, ఈఈ త్రినా ధరావు, నల్లం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మగపిల్లాడిని కనలేదని భార్యపై భర్త దాడి..

7


శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, జూలై 5: చినవెంకన్న క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీపై శుక్రవారం అమావాస్య ప్రభావం కనిపించింది. ఆలయంలోని అన్ని విభాగాలు దాదాపు ఖాళీగా కన్పించాయి. శ్రీవారి క్షేత్రానికి సాధారణంగా ప్రతీ రోజూ వందలాదిగా భక్తులు తరలి వస్తారు. ఆషాఢమాసం ముందు అమావాస్య కావడంతో ఆలయానికి వందల సంఖ్యలోనే యాత్రికులు తరలివచ్చారు. దేవస్థానం, ప్రైవేటు ఫ్యాన్సీ దుకాణాలు మధ్యాహ్నం సమయానికే మూతపడ్డాయి. రానున్నది ఆషాఢమాసం కావడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కాస్త తగ్గవచ్చని దేవాలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


ఖాళీగా క్యూకాంప్లెక్స్..

ఎరుపెక్కిన గోదావరి
పెరుగుతున్న నీటిమట్టం

పోలవరం, జూలై 5 : పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదులు పొంగి గోదావరిలో కలుస్తుండడం వల్ల శుక్రవారం గోదావరి నీటిమట్టం పెరిగి పూర్తిగా ఎరుపు రంగులోకి మారింది. గండి పోశమ్మ ఆలయం, పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వద్ద నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.470 మీటర్లు, స్పిల్వే దిగువన 16.350 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.530 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.330 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.


పట్టిసీమ శివక్షేత్రం వద్ద గోదావరి

హరివిల్లు విరిసే..
కనువిందు చేసిన ఇంద్రధనుస్సు

ద్వారకా తిరుమల, జూలై 5: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఏడురంగుల ఇంద్రధనుస్సు చూపరులను కనువిందుచేసింది. శుక్రవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. సాయంత్రం నుంచి వాతావరణం మారిపోయి మేఘాలు అలుముకుని ఆ తర్వాత ఒక్కసారిగా తుంపరులు కురిశాయి. అనంతరం ఆకాశంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇంద్రధనుస్సు కనిపించగా పలువురు వాటిని తిలకించి పరవశించారు.


ద్వారకాతిరుమలలో హరివిల్లు

సమగ్రశిక్ష పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

▸▸ మంత్రి లోకేశ్‌కు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు వినతి

ఏలూరు అర్బన్, జూలై 5 : రాష్ట్రవ్యాప్తంగా 2012 నుంచి జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో సమగ్రశిక్ష ప్రాజెక్టు కింద పనిచేస్తున్న ఐదువేల మంది పార్ట్‌టైం, కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ పార్ట్‌టైం, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏలూరులో వివరాలను పత్రికలకు విడుదల చేశారు. ఇన్‌స్ట్రక్టర్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని మంత్రిని కోరామన్నారు. కనీస వేతనం కింద నెలకు రూ.33 వేలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ నియామక నిబంధనల్లో పార్ట్‌టైం అనేపదాన్ని తొలగించి ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా మార్చాలని అభ్యర్థించారు. భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచిన ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులన్నింటిని మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో చేర్చి నింపాలని కోరామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులను రద్దుచేసి వాటిని ఎంఈవో-1, 2 పోస్టులుగా కన్వర్ట్ చేశారని, ఇప్పుడు వాటిని రద్దుచేసి యథాతథంగా పూర్వపు పోస్టులనే రెగ్యులర్ విధానంలో భర్తీచేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్ల కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన సంఘ నాయకుల్లో బాలాజీ తదితరులున్నారు.


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

2,516 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూలై 5: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఆర్కే వ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకై ప్రత్యేక కేటగిరీల్లో 2,516 మంది విద్యార్థులకు నూజివీడు ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి నట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఎన్‌సీసీ కేటగిరీలో మొదటి ఐదురోజులకు గాను 1,141 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం-162 మంది, క్యాప్ విభాగం-167, దివ్యాంగుల విభాగం-249, క్రీడా విభాగం-796 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. జనరల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితా ఈనెల 11న విడుదల చేస్తామని, ఎంపికైన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన, నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో ఈనెల 22, 23 తేదీల్లోనూ, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఆర్కే వ్యాలీలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌లో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు.



రేవు పాటకు షెడ్యూల్ నిల్

నరసాపురం రూరల్, జూలై 5: మాధవాయిపాలెం సఖినేటిపల్లి రేవు పాటకు మూడో రోజు శుక్రవారం ఒక్క షెడ్యూల్ కూడా అమ్ముడుకాలేదు. ఈనెల 8న మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట జరగనుంది. పాటలో పాల్గొనాలంటే పాటదారుడు షెడ్యూల్ కొనుగోలు చేయాల్సి ఉంది. ఎవరూ ఆసక్తి చూపించలేదు. షెడ్యూల్ విక్రయాలకు ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఒక్కటీ కూడా కొనకపోతే పాట వాయిదా వేస్తామని ఎంపీడీవో రమణరావు తెలిపారు.

జన్మభూమి రుణం తీర్చుకుంటా : కిషోర్

పెనుమంట్ర, జూలై 5 : నా జన్మభూమిని, జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఏ స్థాయికి వెళ్లినా మర్చిపోనని జన్మభూమి రుణం తీర్చుకుంటానని ప్రవాసాం ధ్రుడు ఖండవల్లి కిషోర్ అన్నారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే వ్యాపారాలు చేస్తూ స్థిరపడి మార్టేరు గ్రామానికి వచ్చిన ఎన్నారై ఖండవల్లి కిషోర్ దంపతులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం సత్తి సుబ్బన్నరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేశారు. మిత్రుల సహాయ సహకారాలతో ట్రస్టు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో క్రీడల పట్ల ఆసక్తి ఉండి సరైన వసతులు లేని విద్యార్థులను ఎంపిక చేసి జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేయడమే ట్రస్టు లక్ష్యమన్నారు. నాలుగేళ్ల క్రితం అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి బుష్‌తో ఇంటర్వ్యూ చేయాల్సి వచ్చినప్పుడు గంటకుపైగా అనేక విషయాలు చర్చిస్తూ, మధ్యలో ఆయనే నన్ను ఇంటర్వ్యూ చేసిన విధానం, మేధాశక్తి మరువలేనిది అన్నారు. కర్రి శ్రీనివాస్ రెడ్డి, అరిగెల పెద్దిరాజు, కోనాల శ్రీనివాస్ రెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్ రెడిపాల్గొన్నారు.


ఎన్ఆర్ఐ కిషోర్ దంపతులకు సత్కారం

రక్త పింజర పాము పట్టివేత

జంగారెడ్డిగూడెం, జూలై 5 :స్థానిక లక్ష్మీ హాస్పిటల్ సమీపంలో నివాసం ఉంటున్న కూరగంటి కళ్యాణ్ ఇంటివద్ద శుక్రవారం ప్రమాదకరమైన రక్తపింజర పాము సెకండ్ ఫ్లోర్ మెట్లు ఎక్కుతుండగా కనిపించింది. అతడి కుటంబ సభ్యులు పామును చూసి భయంతో వెంటనే స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి కుమార్‌కు సమాచారమిచ్చారు. హుటాహుటిన అక్కడకు వచ్చి పామును పట్టుకుని రక్త పింజర పాము అంటారని తెలిపాడు. దాని బరువు ఐదు కేజీలని, మూడున్నర అడుగులు పొడవుందని తెలిపాడు. పట్టిన పామును సురక్షితంగా అడవిలో విడిచి పెడతానని చెప్పారు.



పెంపుడు జంతువులతో జాగ్రత్త సుమీ..

నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



జంతువుల నుంచి మానవులకు సంక్రమించే కొన్ని వ్యాధులున్నాయని ప్రజలకు తెలిపేందుకే ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఏటా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తారు. బ్యాక్టీరియా, వైరస్, శిలీంద్రాలు, పరాన్నజీవులు మానవులకు జూనోటిక్ వ్యాధులను తెస్తాయి. ఎలుకలు, పౌల్ట్రీ జంతువులు, సరీసృపాలు, ఉభయచరాలు, కీటకాలతో సంబంధం ఏర్పడినప్పుడు అవి జునటిక్ వ్యాధులకు దారి తీస్తాయి. కాని సంక్రమణ సాధారణంగా దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. కొవిడ్-19 జూనోటిక్ వ్యాధికి ఒక ఉదాహరణ.. ఎందుకంటే కొవిడ్-19 కారక ఏజెంట్ గబ్బిలాల నుంచి ఉద్భవించినట్టు పరిగణిస్తాం. నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



ద్వారకాతిరుమల, జూలై 5 :

జూనోసిస్ దినోత్సవ చరిత్ర ఇది..

ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ జూలై 6, 1885న జూనోటిక్ వ్యాధి ర్యాబిస్‌కు మొదటిసారిగా వ్యాక్సిన్‌ను విజయవంతంగా కనుగొన్నారు. పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి టీకా వేసి పునర్జన్మ ఇచ్చిన సందర్భంగా ప్రతీ ఏటా ఈ రోజును జూనోసెస్ దినోత్సవంగా పరిగణిస్తున్నారు. ఈ రోజున ప్రతీ ఏటా పెంపుడు జంతువులకు ఉచిత రేబిస్ టీకాలను వేయిస్తున్నారు.

ప్రధానంగా వ్యాపించే వ్యాధులు

జూనోసిస్ వ్యాధుల్లో ముఖ్యమైనవి రేబిస్, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ (మెదడు వాపు), వైరల్ హెపటైటిస్, అమ్మవారు, డెంగీ, కొక్కెర, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్యాట్ స్క్రాచ్ డిసీజ్, లెప్టోస్పైరోసిస్, సాల్మనెల్లోసిస్, కాలిపెల్లోసిస్, స్టెఫ్లోలోకోకస్, ట్యూబర్ క్యులోసిస్, తామర, అమీబియాసిస్, కొలి బాలంటీడియోసిస్, జియార్డియాసిస్, సార్కోసిస్టోసిస్, ప్యారసైటిక్ జ్యునోసిస్, ఫైలేరియాసిస్, నారికురుపు, స్కేబీస్ వంటివి. ఇటువంటి వ్యాధులను నివారించే పద్ధతులు ప్రజలు తెలుసుకోవాలి. వ్యాధి సరిగ్గా నిర్ధారణ జరగకుంటే అది పెద్దసంఖ్యలో ప్రజలకు సోకుతుంది. మరణానికి కూడా కారణం కావచ్చు. ఈ వ్యాధి సోకిన వారిని విస్మరించకూడదు. కాకుంటే సరైన చికిత్స పొందాలి. ఈ వ్యాధులు నీరు, ఆహారం, పర్యావరణం ద్వారా మాత్రమే కాకుండా అడవి, పెంపుడు జంతువుల ద్వారా కూడా వ్యాపిస్తాయి. పెంపుడు జంతువులను తమ ఇంటిలో ఉంచుకునే వ్యక్తులు సరైన పరిశుభ్రతను పాటించాలి. అనారోగ్యాన్ని నివారించేందుకు వాటికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్ నివేదికల ప్రకారం 70 శాతం అంటువ్యాధులు జంతువుల నుంచి ఉద్భవించాయి.

2024-థీమ్

జూనోటిక్ వ్యాధుల వ్యాప్తిని నిరోధించడం. భవిష్యత్‌లో అంటువ్యాధులు వస్తాయేమో అనే భయాన్ని మేనేజ్ చేయడం ద్వారా జూనోసిస్‌ను అడ్డుకోవడం. వ్యాధి సంసిద్ధత, ప్రతిస్పందన కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం.

కారణాలు ఇవే..

వాతావరణ కాలుష్యం, జీవనోపాధికి మనుషులు పలు ప్రాంతాల్లో సంచరించడం, కలుషితనీరు, ఆహారం, అనారోగ్య అలవాట్లు, వృత్తిరీత్యా పశువులు, పశుఉత్పత్తుల పరిశ్రమలో పనిచేసేవారికి సరైన అవగాహన లేకపోవడం. వ్యాధి నిర్ధారణకు సరైన సౌకర్యాలు లేకపోవడం, వ్యక్తిగత అపరిశుభ్రత, పారిశుధ్యలోపం, పెంపుడు జంతువుల పోషణలో లోపాలు తదితర కారణాల వల్ల జూనోటిక్ వ్యాధులు ప్రబలుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ముఖ్యంగా వ్యక్తిగత, పరిసర పరిశుభ్రత పాటించాలి. మరగకాచిన పాలను, ఉడకబెట్టిన మాంసం తినాలి. కలుషిత నీటికి, నిల్వ ఆహారానికి దూరంగా ఉండాలి. పశువుల కొట్టం చుట్టూ నీరునిల్వ ఉండకూడదు, గోమార్లు, పేల నిర్మూలనకు జాగ్రత్తలు వహించాలి. పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశుపక్ష్యాదులను మందనుంచి వేరుచేయాలి

అవగాహనతో వ్యాధులను నివారించవచ్చు..



పెంపుడు జంతువులతో వాటి యజమానులు జాగ్రత్తగా ఉండాలి. జూనోసిస్ వ్యాధులు చాలా ఉన్నప్పటికీ ఎక్కువ వ్యాధులతో ప్రమాదం తక్కువ. ప్రజల్లో ఆరోగ్య విజ్ఞానంపై అవగాహన అవసరం. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఉండాలి. రక్షిత మంచినీరు, పెంపుడు జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పోషించాలి.

- డాక్టర్ అంగర సురేష్
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ద్వారకాతిరుమల

సమాజాన్ని మేల్కొల్పడంలో నాటికలు కీలకం

ఏలూరు రూరల్, జూలై 5: మరికొంత వినోదం, సందేశం ఒకవైపు, జీవిత సారాంశం మరోవైపు కలగలిపి ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జరుగుతున్న అల్లూరి సీతారామ రాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైఎంహెచ్ఏ హేలాపురి కళాపరిషత్ సం యుక్త ఆధ్వర్యంలో నాటిక పోటీలు రెండోరోజు శుక్రవారం హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్పడంలో నాటికలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

'రాత' నాటిక

తొలుత పోలిదాసు శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించిన 'రాత' నాటికను వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. మనిషికి కష్టం కలిగితే నా రాత ఇంతే నా రాత బాగోలేదు అంటూ ఉంటాడు. సుఖం విషయంలో మాత్రం రాతను గాలికి వదిలేస్తాడు. పొందాల్సినవి మంచిగా పొందుతాడు. తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మాత్రం బాధ్యతలేకుండా ఉంటాడు. అది ఎదుట మనిషి విషయంలోనైనా, ప్రకృతి విషయంలోనైనా ఇలాంటి మనిషి నైజం వల్ల ప్రస్తుత సమాజంలో ఏం జరుగుతోంది? సమాజం ఎటు పోతోంది ? మనిషి జీవనం ఎలా సాగుతోంది? ఈ అనర్థాలకు కారణం ఎవరు? ఇది ఎవరు రాసిన రాత అనే ఇతివృత్తంతో నాటికను ప్రదర్శించారు.


రాత నాటికలో సన్నివేశం

'అజరామరం' నాటిక

అనంతరం కళావర్షిణి ద్రోణాదుల వారిచే 'అజరామరం' నాటిక కంటతడి పెట్టించింది. కీర్తిశేఖర వర్మ జమిందారి వంశానికి వారసుడు. ఉన్నత చదువులు చదివి ఊరి ప్రజల బాగోగులను చూసే ఉద్యోగం చేస్తుంటాడు. ఒకరోజు ఆలయంలో జరిగిన కార్యక్రమానికి కీర్తిశేఖర్‌వర్మ అక్కడ దేవదాసి తన కూతురికి కన్నెరికం జరిపించాలని ప్రయత్నిస్తుంటే ఎదురించి ఆ కన్యను తన సంరక్షణలో ఉంచుతాడు. కొద్దిరోజులకు సౌదామినీ మహిళతో కీర్తిశేఖర వర్మకు వివాహం జరుగుతుంది. అప్పటి నుంచి దేవదాసి కూతురైన ప్రియమణికి కీర్తిశేఖరవర్మ ఇల్లాలు సౌదామినికి ప్రేమను సమానంగా పంచుతుంటాడు. ప్రియమణితో ఉన్న సంబంధం గురించి తెలిసిన సౌదామిని ఎప్పుడూ భర్తను ప్రశ్నించలేదు కాని కాలం ప్రశ్నించేలా చేసింది. ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటి అన్నదే అజరామరం నాటిక స్పష్టం చేసింది. కళాకారులు ప్రదర్శన ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో సోమలింగేశ్వరరావు, ఎం.డి. ఖాజావలీ, రామాంజనేయులు సిద్ధాంతి, వరప్రసాదరావు, రాజగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

తెలుగు రాష్ట్రాలకు మేలు చేసేలా సమావేశం ఉండాలి

ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సమితి అధ్యక్షుడు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్, జూలై 5:హైదరాబాద్‌లో శనివారం జరగనున్న ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరగాలని, రెండు రాష్ట్రాలకు మేలు కలిగేలా ఉండాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీలు తెలంగాణ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రుల స్థాయిలో ఇప్పటివరకు సమావేశం జరగలేదని, గతంలో లేని విధంగా ఇద్దరు ముఖ్యమంత్రులు మంచి మిత్రులు కాబట్టి రాష్ట్రాల ప్రయోజనాలను నెరవేర్చడంలో ఒకింత తగ్గినప్పటికీ మంచి అవగాహనతో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసి ఉందన్నారు. జలవనరులు, విద్యుత్ అంశాలపై అంగీకారానికి రావాలని కోరారు. ఆంధ్రా ఆస్తులను తెలంగాణకి గత సీఎం జగన్ దారా దత్తం చేశారని తెలిపారు. విభజన హామీల్లో ముఖ్యంగా రూ.1.43 లక్షల కోట్ల రూపాయలు ఉమ్మడి ఆస్తులుగా ఉన్నాయని, వాటిలో 58 శాతం ఆంధ్రప్రదేశ్‌కు మిగిలివి తెలంగాణకు చెందేలా.. ఏ సమస్య లేకుండా పరిష్కరించుకోవాలన్నారు. 1956కు ముందు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నటువంటి భద్రాచలంతో పాటు నాలుగు మండలాలను రాష్ట్ర విభజన సమయంలో తెలంగా ణలో కలిపారని, భద్రాచలం దేవస్థానానికి విరాళాలు ఇచ్చిన వారిలో 90 శాతం ఆంధ్రప్రదేశ్ వాసులే ఉన్నారనిన్నారు. రాష్ట్ర జలవనురల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పోలవరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మాట్లాడాలని, దుమ్ము గూడెంను ఆంధ్రాలో కలిపితే పునరావాసం సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సమితి సభ్యులు డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, పడాల ఆంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామరాజు

▸▸ గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, జూలై 5: రాష్ట్ర చేపల రైతుల సంఘం నూతన అధ్యక్షుడిగా నంబూరి వెంకట రామరాజు (తాడినాడ బాబు) ఎన్నికయ్యారు. శుక్రవారం భుజబలపట్నంలో సంఘ మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు నివాసం వద్ద జరిగిన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర చేపల రైతుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తాడినాడ బాబు, కార్యదర్శిగా ఏలూరుకు చెందిన పెన్మెత్స బోసురాజు, సంయుక్త కార్యదర్శిగా గుడివాడకు చెందిన దొప్పలపూడి రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ ఇకపై రాష్ట్రంలో చేపలకు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా ఎమ్మెల్యే కామినేనితో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. చేపల రైతుల సంఘ నాయకులు కొండ్రెడ్డి సత్యనారాయణ, పునూకొల్లు వెంకటరమణ, ఐవీ సత్యనారాయణరాజు, కొల్లూరి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, గుర్రం శ్యాంకుమార్, గాదిరాజు భాస్కరరాజు, చదల వాడ శేషగిరిరావు, పేరిచర్ల రామరాజు, వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో చేపల రైతుల సంఘ నాయకులు

మోటారు సైక్లిస్టుకు గాయాలు

ద్వార కాతిరుమల, జూలై 5: మోటారు సైకిల్‌ను నిర్లక్ష్యంగా నడిపి ముందు వెళ్తున్న మరో బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాలివి.. ఎం.నాగులపల్లికి చెందిన వీరవల్లి ఏడుకొండలు గత నెల 28వ తేదీ రాత్రి సొంత పనిమీద భీమడోలుకు వెళ్తున్నాడు. పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి భీమడోలు మండలం చినలింగపాడుకు చెందిన నంబూరి సంగీతరావు తనబైక్‌ను నిర్లక్ష్యంగా నడుపుతూ ఏడుకొండలు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఏడుకొండలు కింద పడగా చేయి విరగడంతో ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు

ఏలూరు క్రైం, జూలై 5 : పేకాట స్థావరంపై దాడిచేసి చాకచక్యంగా 23 మందిని అరెస్టు చేసి ఎనిమిది లక్షల 45 వేల రూపాయల నగదు సీజ్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి నగదు రివార్డులను ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అందించారు. చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు మండలం కంసాలిగుంట గ్రామంలో 2023 జనవరి 16వ తేదీన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 23 మందిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదే ఏడాది డిసెంబరు 29న కోర్టులో హాజరుపర్చగా నేరం అంగీకరించారు. ఒకొక్కరికి మూడు వేల రూపాయల జరిమానా కోర్టు విధించింది. ఈ కేసులో కోర్టు పోలీసులను అభినందిస్తూ వారికి నగదు రివార్డుగా లక్షా 65 వేల రూపాయలను ఇచ్చింది. ఆ సొమ్ములను ఆమె పోలీస్ సిబ్బందికి అందించారు. అప్పటి చేబ్రోలు ఎస్ఐ స్వామి వారి సిబ్బందికి అందించి అభినందించారు.


నగదు రివార్డును అందించిన ఎస్పీ మేరీ ప్రశాంతి

మగపిల్లాడిని కనలేదని భార్యపై భర్త దాడి..

మునునూరు, జూలై 5: భార్యపై భర్త దాడిచేసిన ఘటనపై మునునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాలివి.. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్లగొప్ప రంగరాజు కొద్ది నెలలుగా మద్యానికి బానిసై భార్య నాగలక్ష్మిని చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలను కన్నావు, మగపిల్లవాడు కావాలంటూ ప్రతి రోజు మాటలతో నరకం చూపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మద్యం తాగి వచ్చిన రంగరాజు భార్యతో గొడవ పడి కర్రతో దాడిచేయగా ఆమె తలకు బలమైన గాయమైంది. బాధితురాలు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగస్టు 6,7,8 తేదీల్లో కేవీపీఎస్ శిక్షణ తరగతులు

భీమవరం అర్బన్, జూలై 5 : కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు భీమవరంలో ఆగస్టు 6,7,8వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం నిరంతరం కేవీపీఎస్ పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో నిర్వహించే టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులకు అన్ని జిల్లాకేంద్రాల్లో అంబేడ్కర్ పూలే పేర్లతో శిక్షణ సెంటర్‌లు ఏర్పాటు చేయలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు దిగుపాటి రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ వెంప దళిత పేటలో దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, దర్యాప్తు పేరుతో కాలయాపన చేయడం సబబు కాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్, నాయకులు చిన్నం నాగేశ్వరరావు, మాదాసి గోపి, గొల్ల ఏడుకొండలు, పి.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రేమికుడు పెళ్లికి నిరాకరించాడని..

▸▸ యువతి ఆత్మహత్యాయత్నం ▸▸ ఆసుపత్రిలో చికిత్స

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 5: ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం తాడేపల్లిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నిడదవోలుకు చెందిన బాదంపూడి మమత ఆసుపత్రి యాజమాన్యం కేటాయించిన క్వార్టర్స్‌లో ఉంటోంది, ఆ యువతి కపిలేశ్వరానికి చెందిన తాతపూడి రాజేష్‌ను రెండేళ్లుగా ప్రేమిస్తుంది. ఈ వ్యవహారంలో రాజేష్ మమతతో పెళ్లి నిరాకరించడంతో మనస్తాపానికి గురై క్వార్టర్స్‌లోనే రాజేష్‌తో వీడియో కాల్ చేసి ఆత్మహత్యకు పాల్పడింది, వెంటనే రాజేష్ ఆమె స్నేహితులను అప్రమత్తం చేసి అడ్డుకునేందుకు వెళ్లగా అప్పటికే ఉరివేసుకుంది. వెంటనే ఆమెను అక్కడి నుంచి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామవరపుకోట, జూలై 5 :రావికంపాడు గ్రామానికి చెందిన ఆవుల ఇస్సాకు (35) అనే వ్యక్తి జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపారు. గురువారం రాత్రి ఇస్సాకు, నాగేశ్వరరావు అనే వ్యక్తులు రామాలయం వద్ద ఘర్షణ పడడంతో ఇస్సాకుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఇస్సాకును చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ వివరించారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు..

ఏలూరు క్రైం, జూలై 5 : రైలు పట్టాలపై ఒక మృతదేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణకు సమాచారం అందడంతో సిబ్బందితో శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు పవర్‌పేటకు చెందిన ఎండమూరి అప్పారావు(41) ఏలూరు గన్‌బజార్ రైలు బ్రిడ్జి కింద శుక్రవారం మధ్యాహ్నం రైలు పట్టాలపై రెండు ముక్కలై ఉన్నాడు. ప్రమాదవశాత్తు జారిపడ్డాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అని తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెచ్‌సీ, తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం, జూలై 5 : ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు బలంగా ఢీకొన్న ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద బైపాస్‌రోడ్డుపై గురువారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనలో ఒక లారీ డ్రైవరు తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. వైజాగ్ నుంచి గోవాకు బూడిద లోడుతో వెళ్తున్న లారీని ఎస్.కె.సంసుద్దీన్ నడుపుతున్నాడు. ఖమ్మం నుంచి వైజాగ్ వెళ్తున్న గ్రానైట్ లారీను ఎ.పుల్లయ్య నడుపుతున్నాడు. ఈ రెండు లారీలు స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకునే సరికి గ్రానైట్ లారీ బూడిద లోడుతో వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. లారీ వెనుక ఉన్న భారీ గ్రానైట్ రాళ్ళు లారీ క్యాబిన్ పైన పడడంతో లారీ డ్రైవర్ పుల్లయ్య క్యాబి న్‌లో చిక్కుకున్నాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో డ్రైవరు పుల్లయ్యను బయటకు తీసి స్థానిక ఏరియా ఆసుపత్రికి, అనంత రం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. బూడిద లారీ డ్రైవరు సంసుద్దీన్, క్లీనర్ ఎం.చిరంజీవిలకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద స్థలంలో లారీలు..
లారీ డ్రైవర్ పుల్లయ్య

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయకర్

భీమవరం టౌన్, జూలై 5 : నరసాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శుక్రవారం జిల్లా కలెక్టరు సి.నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

కలెక్టర్‌కు ఎంపీడీవోల అభినందన

ఆచంట, జూలై 5: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ నాగారాణిని ఆచంట నియోజకవర్గ ఎంపీడీవోలు పి.నర్సింహ ప్రసాద్, ఎస్.శ్రీనివాస దొర, పద్మజ, సుభాషిని శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

పీఆర్ వన్ యాప్‌లో నమోదు


రక్షితమంచినీటి ట్యాంక్ వద్ద పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ

ఆచంట, జూలై 5: మండలంలోని 12 గ్రామాల్లో పీఆర్ వన్ యాప్ ద్వారా గ్రామాల్లోని అన్ని చెత్త కుప్పలు, డ్రెయిన్స్, జంగిల్స్, యాప్‌లో నమోదు చేసి వాటిని తొలగించడం జరుగుతుందని ఈవోపీఆర్‌డీ మూర్తిబాబు తెలిపారు. అదేవిధంగా తాగునీరు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లను పబ్లిక్ కుళాయిలను రిజిస్టర్ చేసి సురక్షితమైన తాగునీరు అందించేందుకు గాను అన్ని పంచాయతీలకు దీనిపై సూచనలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి


ఎమ్మెల్యే రఘురామకు చెక్కు అందిస్తున్న సుబ్రహ్మణ్యరాజు

ఆకివీడు, జూలై 5: ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజుకు దాతలు సహకరించాలని వ్యాపారవేత్త జంపన సుబ్రహ్మణ్యరాజు (జేఎస్ఆర్) అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాలువలు ఆధునీకరణకు తలపెట్టిన నిధికి తనవంతుగా రూ.1.50లక్షలు చెక్కును అందించినట్టు తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి


హెచ్ఎం విక్రమ్‌తో మాట్లాడుతున్న బాలల తల్లులు

ఆకివీడు, జూలై 5: బాల్య సంరక్షణ, విద్యా దినోత్సవం సందర్భంగా రెండో వార్డులోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లులు సమావేశమయ్యారు. పిల్లలకు స్కూల్లో చిన్నప్పటి నుంచే మరుగుదొడ్లకు వెళ్ళడం, పౌష్టికాహారం తీసుకోవడం, పరిశుభ్రమైన బట్టలు వేసుకోవడం వంటి తదితర మంచి అలవాట్లు నేర్పించడంతో పాటు మంచి విద్యాబోధన చేసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. హెచ్ఎం ఆర్వీఎస్ నారాయణ (విక్రమ్), ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ఆకివీడు, జూలై 5: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల కాటుకు గురవ్వరని పీహెచ్‌సీ వైద్యులు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా కళింగుడెంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. జ్వరం, తలనొప్పి, కీళ్ళు, కండరాల్లో నొప్పులు, వికారం, చర్మంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలు ఉంటే డెంగీ కావచ్చునన్నారు. వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రులలో వైద్యులను సంప్రదించాలన్నారు.

రేపు లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

ఆకివీడు, జూలై 5: ఆకివీడు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఈ నెల 7న స్థానిక వి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు లయన్స్ కార్యాలయం నిర్వాహకులు తెలిపారు.

ఆమరణ నిరాహార దీక్షలు చేస్తాం



ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

గణపవరం, జూలై 5 : రొయ్యల మేతల ఫ్యాక్టరీని తక్షణం తెరవాలని, సమస్యలు పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని ఉద్యోగులు, కార్మికులు హెచ్చరించారు. సరిపల్లెలో శుక్రవారం ఫ్యాక్టరీ ఎదుట చేస్తున్న రిలేనిరాహార దీక్షలు 28వ రోజుకు చేరుకున్నాయి. థాయిలాండ్ దేశానికి చెందిన యాజమాన్యం తమ సంస్థ నష్టాల్లో ఉందన్న సాకుతో ఫ్యాక్టరీని మూసి కార్మికులను రోడ్డుపాలు చేశారని వారు ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా తమకు జీతాలు ఇవ్వకపోవడం, తమకు పని చూపకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదన్నారు.

డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ



గణపవరం, జూలై 5: డయేరియా వ్యాధి నివారణకు అంకితభావంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం ప్రభుత్వ వైద్యాధికారి కిరణ్మయి కోరారు. శుక్రవారం గణపవరం, పిప్పర, కాశీపాడు గ్రామాల్లో డయేరియా వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. డయేరియా నివారణకు తాగునీటిని పరిరక్షించాలని, ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ఎంపీహెచ్‌వోలు విల్సన్‌బాబు, వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తూకంలో తేడాలపై ఫిర్యాదు

పెనుమంట్ర, జూలై 5 : ప్రధానమంత్రి గరీబ్ అన్న యోజన పథకం బియ్యం పంపిణీలో తూకం తేడాలపై బీజేపీ, టీడీపీ నాయకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సోమరాజు ఇల్లింద్ర పర్రులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకున్నది.

విద్యార్థులకు బస్ పాస్‌లు అందజేత



పాలకొల్లు అర్బన్, జూలై 5 : స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో 1981లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ప్రస్తుత విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేశారు. గణేష్, కార్యదర్శి కె సాంబశివరావు, హెచ్ఎం ఎస్ జాన్సీలక్ష్మీ, స్టాఫ్ సెక్రటరీ వి ఉదయ్ కుమార్, సూర్యనారాయణ రాజు, విశ్రాంత ఉపాధ్యాయులు పి రామకృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మొగల్తూరు, జూన్ 5: వారతిప్ప ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ముత్యాలపల్లికి చెందిన నాగిడి రాంబాబు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు తిరుమాని ఏడుకొండలు, తిరుమాని వెంకటేశ్వరరావు, దొంగ శ్రీను, పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ ప్రకాష్ పాల్గొన్నారు.

కార్నియాలు దానం

నరసాపురం, జూన్ 5: నరసాపురం పట్టణానికి చెందిన కె.రత్నమాల (88) శుక్రవారం మృతి చెందారు. ఆమె కోరిక మేరకు ఆమె కుమారులు క్యాపిటల్ బద్రి, రాజులు కార్నియాలు దానం చేశారు. ప్రసాద్ ఆసుపత్రికి చెందిన వైద్య సిబ్బంది వీటిని సేకరించారు.

రహదారుల ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలి: కలెక్టర్


హౌసింగ్ డే కార్యక్రమంలో కేకు కట్ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 5 : జిల్లాలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల ప్యాచ్ వర్క్సలను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై జిల్లాలోని రహదారుల స్థితిగతులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ రహదారుల్లో గుంతలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని ఈ విషయమై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మరమ్మత్తులు చేపట్టాలన్నారు.

రహదారుల నిబంధనలపై అవగాహన కల్పించాలి

రహదారుల నిబంధనలపై యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సి.నాగరాణి రవాణా శాఖ అధికారులతో సమావేశమై రహదారుల భద్రతా అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. హైవేలపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలుపుదల చేయడంవలన ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, వాహనాలను నిర్దేశించిన ప్రాంతంలోనే నిలుపుదల చేసేలా పర్యవేక్షించాలన్నారు. స్కూల్ బస్సుల ఫిట్నెస్ తనిఖీలను ఎప్పటికప్పుడు చేయాలన్నారు.

మూగ జీవాలకు సేవలు అందించాలి

భీమవరం టౌన్, జూలై 5 : మూగజీవాలకు అందించే సేవలలో ఎట్టి పరిస్థితుల్లో లోపం ఉండరాదని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖలో కొనసాగుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూగజీవాలకు ఉత్తమ సర్వీస్‌ను అందించాలని, విధులను అంకితభావంతో నిర్వహించాలన్నారు. పశుసంవర్ధక శాఖ సబ్జెక్టు నాకు ఎంతో ఇష్టమైనదని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 2,23,676 ఆవులు, గేదెలు, 61,569 గొర్రెలు, 43,04,397,మేకలు, పందులు, బాతులు, నాటు కోళ్ళు, బాయిలర్, ఫారం కోళ్ళు ఉన్నాయన్నారు.

గృహ నిర్మాణాలు నాణ్యతగా ఉండాలి

ప్రభుత్వం నిర్మించే గృహాలు నాణ్యతతో ఉండేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టరు సి.నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన హౌసింగ్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు నిర్మించే గృహాలు నాణ్యతతో ఉండేలా చూడాలన్నారు.

హైవే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భీమవరం టౌన్, జూలై 5 : జిల్లాలో కొనసాగుతున్న ఎన్.హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అధికారులను ఆదేశించారు. ఎన్ హెచ్-165. ఎన్ హెచ్-216 ప్రాజెక్టులపై సమీక్షించారు. పామర్రు నుంచి ఆకువీడు మీదుగా దిగమర్రు వరకు ఎన్‌హెచ్ 165 నిర్మాణం 104కిలోమీటర్లు కొనసాగుతుందన్నారు. పామర్రు నుంచి ఆకివీడు వరకు 64కిలోమీటర్ల పరిధిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఆకివీడు నుండి భీమవరం మీదగా దిగమర్రు చేరుకునే 40 కిలోమీటర్ల రహదారిలో 17కిలో మీటర్ల పరిధిలో పనులు చేపట్టాల్సిందన్నారు. ఇందు కొరకు భీమవరం బైపాస్ ప్రాంతంలోని ఆరు కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని భీమవరం ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే కత్తిపూడి నుండి ఒంగోలు ఎన్ హెచ్-216 నరసాపురం దిగమర్రు మీదగా లోసరి కలుపుతూ వెళ్లే మార్గం మధ్యలో మొగల్తూరు మండలం కాళీపట్నం వద్ద నేషనల్ హైవే ప్రాంతంలో సీపేజ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి కొన్ని సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి: బొలిశెట్టి


ఎమ్మెల్యే బొలిశెట్టికి వినతి పత్రమిస్తున్న కార్మిక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 5: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బొలిశెట్టికి వినతిపత్రం అందజేశారు. అనంతరం బొలిశెట్టిని సత్కరించారు. భవన కార్మిక సంఘం నాయకులు దువ్వా శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, అత్తిలి బాబి, కోడే సాయిబాలాజీ, పోలిరాతి ఆదినారాయణ, అంకం భాస్కరరావు, శెట్టి సింహాచలం పాల్గొన్నారు.

దొంగతనాలు నివారించాలి

పెంటపాడు, జూలై 5: ముదునూరులో దొంగతనాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పోలీసులను ఆదేశించారు. ముదునూరులో వరుస దొంగతనాలపై స్థానికుల ఫిర్యాదు మేరకు గ్రామంలో పర్యటించారు. పెంటపాడు ఎస్ఐకు ఫోన్ చేసి దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామ జనసేన నాయకుడు బోరాడ శ్రీనివాస్ ఎమ్మెల్యేని సత్కరించారు. బుద్దన బాబులు, బుద్దన నారాయణ, బోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్డు నిర్మిస్తాం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 5: రైతులకు ఇబ్బంది లేకుండా మార్కెట్ పరిధి ప్రాంతాల్లో ఏడాదికి రెండు కోట్ల రూపాయల చొప్పున రూ.10 కోట్ల ఖర్చుతో లింకురోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పడాల మార్కెట్ యార్డులో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతో మాట్లాడి మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు కోరతామన్నారు. అధికారులంతా రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. ఏఎంసీ కార్యదర్శి ప్రభాకరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

పాలకొల్లు రూరల్, జూలై 5 : సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని చింతపర్రులో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని డాక్టర్ ప్రతాప్ కుమార్ పరిశీలించారు. కార్య క్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, డాక్టర్ నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబెత్, ఎస్‌కె అమలేశ్వరరావు, డి.కమల పాల్గొన్నారు.

త్వరితగతిన నారుమడులు వేసుకోవాలి


నారుమడులను పరిశీలిస్తున్న ఏడీఈ అనిల్‌కుమారి

నరసాపురం రూరల్, జూలై 5: రైతులు త్వరితగతిన సార్వా నారుమడులు వేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. రైతులు వేసిన నారుమడుల్ని పరిశీలించారు. నారు మడులకు విత్తనశుద్ధి అవసరమన్నారు. వర్షాలు, తుఫాన్‌లు వచ్చే ప్రభావం ఉన్నందున తీర ప్రాంత రైతులు నారుమడులు వేసి ఊడ్పులు ప్రారంభించాలన్నారు. లేని పక్షంలో ప్రకృతి వైపరీత్యాలకు పంటను కోల్పోయ్యే ప్రమాదం ఉందన్నారు. అధిక మొత్తాల్లో ఎరువులు, పురుగుల మందులు వినియోగించరాదన్నారు. ఆమె వెంట ఏవో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులు బాబూరావు మృతి



నరసాపురం, జూలై 5: టీడీపీ సీనియర్ నాయకులు కొల్లు బాబూరావు(85) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బాబూరావు పార్టీలో ఉన్నారు. పార్టీ నరసాపురం పట్టణ అధ్యక్షులుగా దాదాపు 20ఏళ్ల పాటు కొనసాగారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు పార్టీలోని సీనియర్ నాయకుల అందరికి బాబూరావు సుపరిచితుడు. అయితే అనారోగ్య కారణంగా కొంత కాలం ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. గురువారం సాయంత్రం ఆయనకు అనారోగ్యంగా ఉండటంతో ఆయనే స్వయంలో అంబులెన్స్‌కు ఫోన్ చేసి ప్రభుత్వఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు జానకీరామ్, మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు సంతాపం తెలిపారు.

తీరంలో భారీ వర్షం

నరసాపురం టౌన్,జూలై 5: తీరంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దాదాపు నాలుగు గంటల పాటు ఏకధాటిగా వర్షం పడటంతో పల్లపు ప్రాంతాలన్ని నీట మునిగాయి. స్టీమర్‌రోడ్, మెయిన్‌రోడ్, భూపతినగర్, చలవపేట, నందమూరికాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, శ్రీహరిపేట, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని రోడ్లు చెరువుల్ని తలపించాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బాలింతలకు పౌష్టికాహారం అందజేత

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 5: పట్టణంలోని 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు కూటమి నాయకులు శుక్రవారం పౌష్టికాహారం అందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. జనసేన పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నాయకుడు రౌతు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

10న డిమాండ్స్ డే

వీరవాసరం, (భీమవరం టౌన్) జూలై 5: ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. ఈనెల 10 వ తేదీన దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే జరుగుతుందని అందులో భాగంగా వీరవాసరం మండలంలో కూడా నిరసన కార్యక్రమం జరపాలని సీఐటీయూ మండల కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేస్తూ ఆంజనేయులు మాట్లాడారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వమే పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు.

మహనీయుడు అల్లూరి


అల్లూరి కాంస్య విగ్రహం వద్ద విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

భీమవరంటౌన్, జూలై 5 : స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని ఆచరణలో చూపిన వ్యక్తి అల్లూరి అని, అటువంటి మహనీయుల నుంచి స్ఫూర్తి పొందాలని అల్లూరి సీతారామ రాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అల్లూరి సీతారామ రాజు 127 జయంతి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నేల నాది ఈ భూమి నాది అని పోరాడి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి తీసుకుని వచ్చిన గొప్ప వ్యక్తి అల్లూరి అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నాలుగు రోజులుగా 6 హైస్కూల్లోని విద్యార్థులకు అల్లూరి జీవిత విశేషాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశామని అన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం


కెపి పాలెంలో మంచినీటి ప్రాజెక్టు వద్ద ఫిల్టర్ బెడ్‌లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

మొగల్తూరు, జూలై 5: నియోజకవర్గంలో ప్రతి శివారు ఇంటికి సైతం సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. శుక్రవారం కెపిపాలెం సీడబ్ల్యు మంచినీటి ప్రాజెక్టును పరిశీలించి తాగునీటి సరఫరాలో కలిగే సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి తాగునీరు ఇవ్వడం లేదని, పలు చోట్ల మంచినీటి పైప్‌లైన్‌లకు రంధ్రాలు పడి లీకేజీలు కారణంగా నీరు కలుషితం అవుతుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనితో ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. ప్రతీ రోజు ఒక నిర్దీతమైన సమయానికి తాగునీరు అందించాలని, పైప్‌లైన్‌లు లీకేజ్ కాకుండా చూడాలని వాటికి ఎమైనా మరమ్మతులు చేయాలంటే తక్షణమే ఆపనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో ఫిల్టర్ బెడ్‌లు, ఇతర పరికరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

రాచర్లలో పారిశుధ్యం అధ్వానం


రాచర్ల లో చెత్తతో అధ్వానంగా మారిన మిడ్‌లెవెల్ కాలువ రేవు..


రంగుమారిన తాగునీటి చెరువులో నీరు

పెంటపాడు, జూలై 5 : రాచర్ల గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పక్క చెత్త పేరుకుపోయినా పట్టించుకునే వారే లేరు. గ్రామానికి ఆనుకుని మిడలెవిల్ కాలువ వెళ్తుంది. కాలువలోని ఒక రేవు చెత్తా , చెదారంతో డంపింగ్ యార్డ్‌లా మారిపోయింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. తాగునీటి చెరువు నీరు రంగుమారి ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక వర్షం వచ్చిందంటే వీధులు కాలువల్లా, మురికి కూపాలుగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలసిన వర్మ



భీమవరం టౌన్, జూలై 5 : కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపి నడ్డాను శుక్రవారం నాడు కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలు గురించి ఆయనతో మాట్లాడారు. అదే విధంగా సహాయ మంత్రిగా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై ఆయన వర్మకు మార్గనిర్దేశం చేశారు.

పవన్ కల్యాణ్‌కు జోగయ్య బహిరంగ లేఖ

పాలకొల్లు, జూలై 5: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు శుక్రవారం మాజీ ఎంపీ, కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య బహిరంగ లేఖ రాశారు. ఇప్పటి వరకూ కేవలం రాజకీయ నాయకుడుగా ఉండి ఇప్పుడు ఉపముఖ్యమంత్రి హోదాలో ప్రజాప్రతినిధిగా ఉన్న మీరు రాబోయే ఐదేళ్లలో ప్రజల అవసరాలు తీర్చడంతో పాటు సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో ఉండేలా ముదుకు దూసుకెళ్లాలన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ, రూరల్ వాటర్ సప్లయ్ శాఖల ద్వారా ప్రజలకు మేలు జరిగే పనులకు ప్రాధాన్యం ఇచ్చినట్లయితే రాష్ట్రంలో సగభాగం అభివృద్ధి చెందినట్లేనని అన్నారు. రాజధాని, పోలవరం అభివృద్ధితో పాటు రాష్ట్రం మొత్తంగా అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధిని జరిపించటమే ధ్యేయంగా పని చేయాలన్నారు. కృష్ణా జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని జోగయ్య లేఖలో పేర్కొన్నారు.

కాలువల్లో పేరుకున్న డెక్క తొలగించాలి: ఆరిమిల్లి



తణుకు, జూలై 5: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన కాలువల్లో పేరుకున్న గుర్రపు డెక్క, తూడును తొలగించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలను ఎదుర్కొనేందుకు కాలువ, డ్రైనేజీ గట్లు పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని, డ్రైనేజీ ఇన్‌లెట్ తలుపుల మరమ్మతులు త్వరతగతిన చేయాలన్నారు. డీఈ దక్షిణామూర్తి, డ్రైనేజీ ఈఈ కిషోర్, డీఈఈలు కె.శ్రీనివాసు, వరప్రసాదు, ఏఈలు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

తణుకు, జూలై 5: ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని చాకలిచెరువు, టి.వేమవరం ప్రాంతాల్లో మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వే చేసి, డెంగీపై అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు. వార్డు కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కుక్కలకు వ్యాక్సిన్

తణుకు, జూలై 5: వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకా వేస్తామని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ సూర్యచంద్రరావు తెలిపారు. శనివారం స్థానిక పశువుల ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ జరుగుతుందని, పట్టణంలో పెంపుడు కుక్కల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇరగవరం: పశువుల ఆసుపత్రిలో శనివారం కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఇరగవరం, పేకేరు, రేలంగి, కత్తవపాడు గ్రామాల్లోని పశువుల ఆసుపత్రిలో జరిగే ఈ టీకాల కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నరసాపురం రూరల్: పట్టణంలోని పశువైద్యశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించకుని 600 కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయనున్నట్లు ఆశాఖ ఏడీ డాక్టర్ వై.సుధాకర్ తెలిపారు. పట్టణ, మండలం, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కలకు కూడా వ్యాక్సిన్లు వేస్తామన్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది వ్యాక్సిన్లు వేస్తారని ఆయన తెలిపారు.

న్యాయవాదుల నిరసన



తణుకు, జూలై 5: కొత్త క్రిమినల్ చట్టాలు నిలుపుదల చేయాలని కోరుతూ కోర్టు వద్ద ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. కరోనా సమయంలో ఎలాంటి చర్చ జరపకుండా పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి క్రిమినల్ చట్టాలను బీజేపీ ఆమోదించిందని ఆరోపిస్తూ వెంటనే కొత్త చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం నాయకుడు కౌరు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పి. ప్రతాప్‌కుమార్, విక్టర్ బాబు పాల్గొన్నారు.



పోతుల అన్నవరం జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 5: పెదతాడేపల్లి సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుల అన్నవరం జన్మదిన వేడుకలు తాడేపల్లిగూడెం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, గంధం సతీష్, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, తదితరులు అన్నవరానికి గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేద విద్యార్థినికి జనసైనికుల సాయం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 5 : ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకులు కాకూడదని ఏదైనా విద్యతోనే తన జీవిత ఆశయం సాధించవచ్చు అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. లక్ష్మీఈశ్వరీ అనే విద్యార్థిని ఆర్థిక ఇబ్బందులతో విద్యను అభ్యసించేందుకు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా జసేననాయులు లక్కోజీ నాని వారి మిత్రబృందం ఏ భద్రం, వి.సతీష్ రూ.20వేలుసేకరించి ఆర్థిక సాయం చేశారు. మాజీ కౌన్సిలర్ మాగాపు ప్రసాద్, జనసేన నాయకులు సయ్యద్ బాజీ,యర్రంశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 5: కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టి 20 రోజులు కాలేదని అప్పుడే పథకాలు అమలు చేయడం లేదంటూ ఎలా విమర్శిస్తారని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు దోపిడీకి పాల్పడినందునే ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని విమర్శించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఇరగవరం, జూలై 5 : పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటమని ప్రధాని మోదీ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు ఇరగవరంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అసెంబ్లీ కన్వీనర్ అయినంపూడి శ్రీదేవి, మండల అధ్యక్షులు కాట్నం పరిపూర్ణ, సెలబోయిన శ్రీను, ముప్పిడి సుబ్బయ్య, కోడె భాస్కరరావు, కడలి విజయ్‌బాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.